# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 164 30-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## నేడు దోహాలో చర్చలు

ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

ధ్రువీకరించని ఇరాన్ 6 బిలియన్ డాలర్ల

ఇరాన్ నగదు నిల్వలను విడుదల చేయనున్న ఖతర్

2లో

## మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు

మూసీ ప్రాజెక్టు భూసేకరణ, పునరావాసం అంశాలపై పొంగులేటి సమీక్ష

ఇళ్లు కోల్పోయే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశం

భూములు కోల్పోయే రైతులకు పరిహారం, పునరావాసం కల్పిస్తామని వెల్లడి



2లో

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న సీతక్క

కొత్త పథకం ప్రవేశపెడితే మొత్తం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని వ్యాఖ్య

పీఎం ఆవాస్ యోజన కింద తక్షణమే గృహాలను మంజూరు చేయాలని విన్నపం



2లో



## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి...


- వాటితోనే రేవంత్ గెలిచారా?: కవిత
- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత



2లో

# ఫ్రాన్స్‌ను హడలెత్తిస్తోన్న ఎండలు..





## వెయ్యికి చేరిన మృతులు

## అమెరికానే కారణమంటూ విమర్శలు

ఐరోపా దేశాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. భానుడు భగభగ మండిపోతున్నాడు. తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు అల్లాడపోతున్నారు. అనేక మంది రోగాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. దాదాపుగా 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వాస్తవంగా భారత్ సహా ఆసియా దేశాల్లో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం మామూలు విషయమే కానీ.. ఐరోపా దేశాల్లో ఈ స్థాయిలో నమోదు కావడంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. దీంతో ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో 1,000 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది ఆస్పత్రుల పాలయ్యారు. ఇదిలా ఉండగా పారిస్‌లో కొనసాగుతున్న వేడిపై అమెరికా జర్నలిస్టులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు అపహాస్యం చేస్తున్నారు.

- మిగతా 2వ పేజీలో

# డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని నితిన్ నబిన్ ధీమా

యువతకు ఇచ్చిన హామీలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శ

స్టార్టప్‌లతో యువత ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని వెల్లడి

నిర్ణయాత్మక నాయకత్వంతోనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్న బీజేపీ చీఫ్



తెలంగాణ సమగ్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, 'డబుల్ ఇంజిన్ సర్కార్' వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నేడు ఘట్‌కేసర్ సమీపంలో జరిగిన 'వికసిత్ భారత్ స్టూడెంట్ కాంక్లేవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

- మిగతా 2వ పేజీలో



2లో

## అయోధ్య విరాళాల రగడ

- చంపత్ రాయ్‌కు వీహెచ్‌పీ మద్దతు
- రామమందిర నిధుల వివాదంలో చంపత్ రాయ్ రాజీనామాకు విపక్షాల పట్టు
- విచారణకు సహకరించేందుకే ఆయన రాజీనామా చేశారన్న వీహెచ్‌పీ చీఫ్ అలోక్ కుమార్
- ట్రస్టు పారదర్శకంగా వ్యవహరించిందని స్పష్టీకరణ
- కేజ్రీవాల్, కాంగ్రెస్ నేతలపై విమర్శలు



## ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి

అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు గర్వపడాలన్న సీఎం

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ఆదేశం

రూ.50,999 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడి

ప్రతి రెండు నెలలకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష జరుపుతామన్న చంద్రబాబు

అసెంబ్లీ, హైకోర్టు నిర్మాణాలు ఐకానిక్‌గా ఉండాలని సూచన

దేశం గర్వించే రాజధాని అమరావతి నిర్మాణంలో భాగమైనందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని, ఇది కేవలం కట్టడాల నిర్మాణం కాదని, ఓ చరిత్ర నిర్మాణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు సంస్థలు, తాము

- మిగతా 2వ పేజీలో

# కష్టపడి చదవండి..

మీ కలలు నెరవేర్చే బాధ్యత నాది: మంత్రి నారా లోకేశ్

త్వరలో రాష్ట్ర విద్యారంగంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకొస్తామని ప్రకటన

సమాజంలో మార్పు కోసం కొంతమంది విద్యార్థులైనా రాజకీయాల్లోకి రావాలని పిలుపు

షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలు విని తక్షణ సాయంపై హామీలు

ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని వెల్లడి

"మీరు కష్టపడి చదవండి.. విద్యాశాఖ మంత్రిగా మీ కలలను సాకారం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాను" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆయన

- మిగతా 2వ పేజీలో



## ఫ్రాన్స్‌ను హడలెత్తిస్తోన్న ఎండలు..

దీంతో ఫ్రాన్స్‌లో వేడికి అమెరికానే కారణంగా అంటూ ఫ్రాన్స్ దుమ్మెత్తిపోస్తోంది. మా ప్రతి గదిలో ఎయిర్ కండిషనింగ్ ఎందుకు లేదని విమర్శించారు. ప్రపంచంలో గ్రీన్‌హౌస్ వాయువులను అత్యధికంగా విడుదల చేసే దేశాల్లో మీరు రెండవ స్థానంలో ఉన్నారని ఫ్రాన్స్‌కు చెందిన పారిస్ డిప్యూటీ మేయర్ పల్వర్ సోషల్ మీడియాలో విమర్శించారు. చాలా మంది అమెరికన్లు.. ఫ్రాన్స్‌లో ఎయిర్ కండిషనింగ్ ఎందుకు లేదని ప్రశ్నిస్తూ విమర్శించారు. వాస్తవానికి జర్మనీలో కేవలం 7 శాతంతో పోలిస్తే.. ఫ్రాన్స్‌లో సగటు ఎయిర్ కండిషనింగ్ కేవలం 25 శాతం మాత్రమే. ఫ్రాన్స్, జర్మనీలోని చాలా ఇళ్లు, కార్యాలయాల్లో ఎయిర్ కండిషనింగ్ ఉండదు. కూలర్లు, ఫ్యాన్లను కూడా అరుదుగా ఉపయోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో అమెరికన్లు.. ఫ్రాన్స్‌ను ఎగతాళి చేశారు. దీంతో పారిస్ డిప్యూటీ మేయర్ ఆడ్రీ పుల్వర్ ప్రతిస్పందించారు. ఫ్రాన్స్‌లోని తీవ్రమైన వేడిమి, వడగాలులకు అమెరికానే కారణమని ఆరోపించారు. అమెరికా అత్యధిక కార్బన్ ఉద్గారాలను విడుదల చేసే దేశమని.. ఇది గ్లోబల్ వార్మింగ్‌కు, తత్ఫలితంగా యూరప్‌లోని వేడికి కారణమవుతోందని పుల్వర్ వాదించారు. ఇదిలా ఉంటే ఇప్సోస్ సర్వే ప్రకారం.. 78 శాతం మంది ఫ్రెంచ్ ప్రజలు ఎయిర్ కండిషనింగ్ వాడటం మంచిది కాదని నమ్ముతున్నారు. సర్వేలో పాల్గొన్న ప్రతి ఆరుగురిలో ఒకరు మాత్రమే ఎయిర్ కండిషనర్ వాడటం ఫర్వాలేదని చెప్పారు. కొంత వేడిని తట్టుకోవడం ఫర్వాలేదు కానీ.. పర్యావరణం కోసం దాని వాడకాన్ని నివారించడం చాలా ముఖ్యం అని అన్నారు. అయితే గత వారం తీవ్రమైన వేడి ప్రజల అభిప్రాయాలను మార్చింది. పెద్ద సంఖ్యలో ప్రజలు దుకాణాలకు తరలివచ్చి ఎయిర్ కండిషనర్లను కొనుగోలు చేశారు.

## నేడు దోహాలో చర్చలు

దుబాయ్: ఇరాన్‌పై ఓవైపు దాడులు చేస్తూ మరోవైపు చర్చలకు సిద్ధపడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్‌పెట్టారు. "దాడులకు తట్టుకోలేక మాతో సమావేశానికి ఇరాన్ సిద్ధపడింది. అందుకే మంగళవారం ఇరాన్ ప్రతినిధి బృందంతో సమావేశంకాబోతున్నాం. ఖతర్ రాజధాని నగరం దోహాలో ఈ సమావేశం జరగనుంది"అని ట్రంప్ ప్రకటించారు. హార్ముజ్‌లో విదేశీ చమురునౌకపై ఇరాన్ దాడిచేసిందని ప్రతిగా ఇరాన్ డ్రోన్లు, క్షిపణి స్థావరాలపై అమెరికా దాడిచేయడం, ఇందుకు ప్రతీకారంగా బహ్రెయిన్, కువైట్‌లపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడటంతో మళ్లీ పరస్పర దాడులు మొదలయ్యాయని పశ్?చమాసియాలో ప్రబలిన భయాందోళనల మధ్య తదుపరి దశ చర్చలున్నాయంటూ ట్రంప్ సోమవారం ప్రకటన చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ప్రకటనకు భిన్నంగా ఇరాన్ స్పందించింది. మంగళవారం చర్చల కోసం ఎలాంటి షెడ్యూల్ లేదు అని ఇరాన్ సీనియర్ మధ్యవర్తి కాజెమ్ ఘరిబాబాడీ స్పష్టంచేశారు. మరోవైపు చర్చల ప్రతిపాదనల్లో పేర్కొన్న ప్రకారం ఖతర్ తమకు చెందిన గతంలో స్తంభింపజేసిన 6 బిలియన్ కోట్ల డాలర్ల ఆస్తులను త్వరలో విడిపించనుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోమవారంప్రకటించారు. హార్మూజ్ జలసంధిపై తమకు ఇంకా పట్టు ఉందని, ఒప్పందానికి ఇరాన్ ప్రజల మద్దతు ఉందని తెలియజేసేందుకే పెజెష్కియాన్ ఈ ప్రకటన చేసినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం చర్చలు ఉంటాయని ఈ అంశంలో మధ్యవర్తి పాత్ర పోషిస్తున్న పాకిస్తాన్ సోమవారం ప్రకటించింది. సాంకేతిక అంశాలపై మరి కొద్ది రోజుల్లో చర్చలు ప్రారంభమవుతాయని అమెరికా సైతం మరో ప్రకటనలో పేర్కొంది.

## వీబీ జీ రామ్ జీ పథకంపై కేంద్రానికి అభ్యంతరాలను తెలియజేసిన సీతక్క

వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో పాల్గొన్న ఆమె... తెలంగాణలో అమలు చేస్తున్న గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలను కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా? లేక కొత్త పథకం తీసుకురావాలా? అనే అంశంపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీతక్క ప్రకటించారు. కొత్త పథకం ప్రవేశపెడితే 100 శాతం ఆర్థిక భారం రాష్ట్రంపైనే పడుతుందని, ఇది సమస్యాత్మకమని కేంద్రానికి తెలియజేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో 100 శాతం వేతనాల విధానం కొనసాగించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పీఎం ఆవాస్ యోజన కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో కేటాయింపులు లేవని... ఆ పథకం కింద తక్షణమే గృహాలు మంజూరు చేయాలని సీతక్క కోరారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులు ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. తెలంగాణలో జల్ సంచార్ విభాగంలో 13 జాతీయ అవార్డులు సాధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు.

## మూసీ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగదు

మూసీ నది పునరుద్ధరణ ప్రాజెక్టులో ఎవరికీ అన్యాయం జరగనీయబోమని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. భూసేకరణ, పునరావాసం అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి... మానవీయ కోణాన్ని దృష్టిలో ఉంచుకుని భూసేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని సూచించారు. భూములు కోల్పోయే రైతులకు తగిన పరిహారం, పునరావాసం అందించాలని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగరం మరింత అందంగా మారాలని, విస్తృతంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రాజెక్టు వల్ల ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి...

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు.

# ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి

ఒక బ్రాండ్‌ను సంపాదిస్తున్నామన్న భావనతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "హైదరాబాద్ ప్లస్‌గా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇది యావత్ దేశానికి గర్వకారణంగా నిలవాలి. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా రూపుదిద్దుకుంటున్న అమరావతిలో మేం భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు పనిచేయాలి" అని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువు కంటే ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లు రాష్ట్రానికి ఐకానిక్ నిర్మాణాలుగా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో రూ.50,999 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రా, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాతో పాటు కీలకమైన ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. పనుల వేగవంతానికి అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు పనుల్లో నిమగ్నమై ఉన్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్తులో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా కొండవీటి వాగు, పాలవాగులను వెడల్పు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేశారని, రెండేళ్లుగా తాము మళ్లీ పనులను గాడిలో పెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. దేశంలోని పవిత్ర క్షేత్రాల నుంచి మట్టి, నీరు తెచ్చి పునీతం చేసిన ఈ ప్రాంతంలో నిర్మాణాలను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అయినా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించేందుకు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం అవుతానని తెలిపారు. నిర్మాణాలు పూర్తయ్యాక, ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ సమీక్షలో సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అయోధ్య విరాళాల రగడ

అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ గట్టిగా మద్దతు పలికారు. అంతేకాదు, రాయ్ రాజీనామాను డిమాండ్ చేసిన రాజకీయ నాయకులపై ఆయన తీవ్రస్థాయిలో ఎదురుదాడికి దిగారు. అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాలు, వెండి ఇటుకలు వంటి విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తడంతో, నైతిక బాధ్యత వహిస్తూ చంపత్ రాయ్ ఇటీవలే తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయంపై సోమవారం మాట్లాడిన అలోక్ కుమార్, ఈ వ్యవహారంలో పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ట్రస్ట్ తీసుకున్న చర్యలే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "ఈ ఆరోపణలు వెలుగులోకి రాగానే ట్రస్ట్ వెంటనే ప్రాథమిక విచారణ జరిపి, దోషులను గుర్తించి, రూ. 80 లక్షలు రికవరీ చేసింది. ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదిక ఆధారంగా 8 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది" అని అలోక్ కుమార్ వివరించారు. విచారణకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే చంపత్ రాయ్‌తో పాటు మరో ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా స్వచ్ఛందంగా తమ పదవుల నుంచి తప్పుకున్నారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా, చంపత్ రాయ్ రాజీనామా కోరిన నేతల తీరును అలోక్ కుమార్ తప్పుబట్టారు. గతంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నప్పటికీ ఎందరో నేతలు పదవుల్లోనే కొనసాగారని ఆయన గుర్తుచేశారు. "అరెస్ట్ అయినప్పటికీ కేజ్రీవాల్ జైలు నుంచే ముఖ్యమంత్రిగా కొనసాగాలని పట్టుబట్టారు. జేఎంఎం ఎంపీల కొనుగోలు కేసులో మాజీ ప్రధాని నరసింహారావుపై, బోఫోర్స్ కుంభకోణంలో రాజీవ్ గాంధీపై ఆరోపణలు వచ్చినా వారెవరూ రాజీనామా చేయలేదు" అని విమర్శించారు. ఆప్, కాంగ్రెస్ సీనియర్ నేతల ప్రవర్తనకు, చంపత్ రాయ్ నైతిక ప్రవర్తనకు మధ్య ఉన్న తేడా ఇదేనని ఆయన వ్యాఖ్యానించారు.





## డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ.. "ప్రస్తుత యువతరం (+వల్గ) దేశ వ్యతిరేక ఆలోచనలతో కాకుండా, దేశ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోంది. కొందరు క్రీడల్లో, మరికొందరు స్టార్టప్‌లతో తమ భవిష్యత్తును, దేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. దేశంలో 2.25 లక్షల మంది యువత స్టార్టప్‌ల ద్వారా ఉద్యోగ సృష్టికర్తలుగా మారారు" అని అన్నారు. దేశ రాజ్యాంగాన్ని, సంస్కృతిని ప్రశ్నించేవారు నిజమైన యువతరం కాదని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే దేశంలో 2 లక్షలకు పైగా స్టార్టప్‌లు, 125కు పైగా యునికార్న్‌లు ఆవిర్భవించాయని తెలిపారు. "నేటి యువత ఉద్యోగాలు సృష్టించే వారిగా మారుతున్నారు. వారి ఆవిష్కరణలు, సామర్థ్యాలు దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి" అని వివరించారు. యువత రాజకీయాల్లోకి రావాలని, స్పష్టమైన లక్ష్యంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై నితిన్ నబిన్ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర యువతకు ఉపాధి, అభివృద్ధి వంటి కీలక హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ యువతలో అపారమైన ప్రతిభ, నైపుణ్యం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిర్ణయాత్మక నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, ఆయన బీహార్ అనుభవాన్ని పంచుకున్నారు. "2005లో బీహార్‌లో మా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడింది. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికే చాలాకాలంగా ఉన్న డీజీపీనే కొనసాగించారు. అయితే, నాయకత్వం మారడంతో అదే డీజీపీ ఒకటిన్నర సంవత్సరాల్లో బీహార్‌లో శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చారు. దీన్నిబట్టి సమర్థవంతమైన నాయకత్వం ఉంటే వ్యవస్థ ఎంతలా మారుతుందో అర్థం చేసుకోవచ్చు" అని ఉదహరించారు. సోషల్ మీడియా వాడకం పెరగడంతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని, నాయకులు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తుంచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కష్టపడి చదవండి..

ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం ఆద్యంతం స్ఫూర్తిదాయకంగా, ఆసక్తికరంగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'డ్రీమ్ వాల్స్', 'గ్రాటిట్యూడ్ వాల్స్'పై విద్యార్థులు రాసిన మాటలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని లోకేశ్ తెలిపారు. విద్యార్థులు అద్భుతమైన సలహాలు ఇచ్చారని, వారిలో కొంతమంది అయినా రాజకీయాల్లోకి వస్తేనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. తాను రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఏ రాష్ట్రంలో లేని విద్యా సంస్కరణలు ఏపీలో తీసుకురాగలుగుతున్నానని అన్నారు. విధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ఆకాంక్షలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి స్కూలు స్థాయి నుంచే కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌పై శిక్షణ, మోటివేషన్ క్లాసులు, లైబ్రరీల అవసరాన్ని ప్రస్తావించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలను ప్రక్షాళన చేస్తున్నామని, పుస్తకాలు చదవడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని అన్నారు. మండలం, నియోజకవర్గం, జిల్లా, జోనల్ స్థాయిలో లైబ్రరీలను బలోపేతం చేస్తామని, ఏడాదిలోగా అమరావతిలో ప్రపంచస్థాయి గ్రంథాలయాన్ని నిర్మించబోతున్నామని హామీ ఇచ్చారు. మరో విద్యార్థిని అన్నపూర్ణేశ్వరి ఎన్‌సీసీ, కంప్యూటర్ ల్యాబ్ కావాలని కోరగా, త్వరలోనే రాష్ట్రంలోకి ఏఐ ట్యూటర్‌ను తీసుకువస్తున్నామని, అలాగే ఏపీకి ప్రత్యేకంగా ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్‌ను కేంద్రం మంజూరు చేసిందని శుభవార్త తెలిపారు.

### విద్యార్థుల భావోద్వేగ కథలు.. మంత్రి భరోసా

కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ వ్యక్తిగత కష్టాలను, ఉన్నత లక్ష్యాలను పంచుకున్నారు. కదిరికి చెందిన షేక్ చాందిని, ఇంటర్‌లో 1000కి 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచానని, తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నానని తెలిపింది. నీట్ కోసం కోచింగ్ ఇప్పించాలని కోరగా, అందుకు పూర్తి సహాయం అందిస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు. టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిణిగా విజన్ 2047 సాధనకు కృషి చేస్తానని చెప్పింది. ఆత్మకూరుకు చెందిన షేక్ అనీషా, పాఠశాల స్థాయి నుంచే పోటీపరీక్షలకు శిక్షణ ఇవ్వాలని కోరగా, రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళిక రచిస్తామని లోకేష్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా విద్యార్థి పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శిక్షణ కోరగా.. రాబోయేది ఏఐ విప్లవమని, పాఠశాల స్థాయి నుంచే ఏఐ ల్యాబ్స్, ఫండమెంటల్స్‌పై శిక్షణ ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మనీష, తన తండ్రి చదివించలేని పరిస్థితుల్లో ఉన్నారని కన్నీటిపర్యంతమవ్వగా, మంత్రి లోకేష్ చలించిపోయారు. "ధైర్యంగా ఉండు, నీ చదువుకు నేను సాయం చేస్తా" అని హామీ ఇచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆపకూడదనేదే తన లక్ష్యమని, అలాంటి వారిని గుర్తించి చేయూతనిస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లాకు చెందిన భాగ్యం అనే విద్యార్థిని, చిన్నతనంలోనే పెళ్లయినా ఆరేళ్ల తర్వాత మళ్లీ చదువు ప్రారంభించి ఒకేషనల్ కోర్సులో 990 మార్కులతో టాపర్‌గా నిలిచానని, ఇప్పుడు డిగ్రీ చదవాలని ఉందని చెప్పగా, ఆమెకు కూడా సాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానంగా, తాను ఎప్పుడూ బట్టీ కొట్టలేదని, తన బలం అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ అని లోకేశ్ తన విద్యార్థి జీవితాన్ని గుర్తుచేసుకున్నారు. శంఖవరం విద్యార్థిని స్వాతి తన గ్రామంలోని రోడ్డు దశాబ్దాలుగా అధ్వానంగా ఉందని చెప్పగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చారు. విద్యార్థులకు శారీరక విద్యతో పాటు మానసిక ఆరోగ్య అవగాహన కూడా కల్పించాలని విశాఖ విద్యార్థి శ్రీహర్ష చేసిన సూచనను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమం కేవలం సత్కారాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు వారధిగా నిలిచింది.



# చల్లూరులో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

- ప్రారంభించిన సర్పంచ్ భీమగాని రూప-బాలనర్సయ్య
- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో అభివృద్ధి

**తొలివెలుగు, రాజాపేట:** మండలం చల్లూరు గ్రామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గ్రామంలోని వివిధ వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య చొరవతో, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధుల నుంచి నిధులు మంజూరయ్యాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమగాని రూప-బాలనర్సయ్య పాల్గొని రోడ్డు నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొంత సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీనివాస పవర్లూమ్స్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- జూలై 2 నుంచి నామినేషన్ల స్వీకరణ.. 10న పోలింగ్
- వివరాలు వెల్లడించిన ఎన్నికల అధికారి అజీమోద్దీన్



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆవరణలో శ్రీనివాస పవర్లూమ్స్ సొసైటీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి ఎండి. అజీమోద్దీన్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యుల సమక్షంలో ఎన్నికల నియమావళిని చదివి వినిపించారు. సొసైటీలో మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో మహిళలకు రెండు స్థానాలు, జనరల్ అభ్యర్థులకు ఏడు స్థానాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూలై 2 నుంచి 4వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ చేపడతారు. జూలై 5న నామినేషన్ల పరిశీలన నిర్వహించనుండగా, జూలై 6న నామినేషన్ల ఉపసంహరణతో పాటు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు. జూలై 10న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఎన్నికల ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి పదవులను భర్తీ చేయనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన మూడు రోజుల్లోగా చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు ఆడేపు లక్ష్మీనారాయణ, సభ్యులు ఆడేపు శ్రీశైలం, ఆడేపు పాండరి, ఆడేపు శేఖర్, ఆడేపు గణేష్, సకినాల చిరంజీవులు, పొట్టబత్తిని నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో సొసైటీ ఎన్నికల సందడి నెలకొంది.

# కాల్వపల్లి మదర్ డైరీ చైర్మన్‌గా గుంటి శ్రీశైలం ఏకగ్రీవం

- వరుసగా తొమ్మిదోసారి రికార్డు స్థాయి ఎన్నిక
- రైతుల సంక్షేమమే ధ్యేయం: చైర్మన్ శ్రీశైలం

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని కాల్వపల్లి మదర్ డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార సొసైటీ చైర్మన్‌గా గుంటి శ్రీశైలం వరుసగా తొమ్మిదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో డైరెక్టర్లందరూ ఏకాభిప్రాయంతో శ్రీశైలంను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఒకే వ్యక్తి వరుసగా తొమ్మిది పర్యాయాలు డైరీ చైర్మన్‌గా ఎన్నికై రికార్డు సృష్టించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్లు, పాడి రైతులు, గ్రామస్తులు నూతన చైర్మన్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం గుంటి శ్రీశైలం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో వరుసగా 9వసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లకు, పాడి రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా, డైరీని మరింత లాభాల బాటలో నడిపించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.



# కాంగ్రెస్ గ్రామ శాఖ నూతన కమిటీ ఎన్నిక

- బసంతాపురం కాంగ్రెస్ అధ్యక్షుడిగా మెండు ఉపేందర్ రెడ్డి
- మండల నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపిన కార్యవర్గం
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: ఉపేందర్ రెడ్డి



**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని బసంతాపురం గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మార్గదర్శకత్వంలో, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బసంతాపురం సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామ శాఖ అధ్యక్షుడిగా మెండు ఉపేందర్ రెడ్డిని ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుండ్లపల్లి వినయ్, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వడ్లకొండ మహేష్ బాబు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మెండు పూలమ్మ ఎన్నికయ్యారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మెండు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గందమల్ల బాలకృష్ణ గౌడ్, సెక్రటరీగా మెండు సాయి కుమార్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా జంగిటి రవికుమార్, కోశాధికారిగా మెండు మహేందర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్నికల్లోనూ పార్టీ విజయమే లక్ష్యంగా శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# కేజీబీవీల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం
- నాణ్యతలో రాజీ పడితే చర్యలు తప్పవు

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల నిర్మాణ, మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేసి, విద్యార్థినులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బిక్షపతితో కలిసి కేజీబీవీ ప్రత్యేక అధికారులతో (ఎస్ఓలు) ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో ఇంకా పూర్తికాని పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్స్, పారిశుధ్యం తదితర



మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

- పులిగిల్ల, గోలిగూడెంలో తహసీల్దార్ దశరథ తనిఖీ
- అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలి

**తొలివెలుగు, వలిగొండ:** మండలంలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పరిశీలన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని వలిగొండ తహసీల్దార్ దశరథ బూత్ స్థాయి అధికారులను (బీఎల్వోలు) ఆదేశించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని పులిగిల్ల, దాని పరిధిలోని మధిర గ్రామం గోలిగూడెంలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, సవరణల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఇన్యుమరేషన్ ప్రక్రియ పక్కాగా సాగాలన్నారు. గ్రామంలోని అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకోవాలని, ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలు సహకరించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ.. బీఎల్వోలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో బీఎల్వోలు మంగమ్మ, సతీష్, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.





# వరుణ దేవుడా.. కరుణించు!

- రాజాపేటలో పెరిక కుల మహిళల 'వాన' పాటలు
- వేపకొమ్మలు, నీటి బిందెలతో కూడలిలో బతుకమ్మ ఆటలు

**రాజాపేట, తొలివెలుగు:** "వానలు కురవాలి వరుణ దేవుడా.. రైతుల కష్టాలు తీరాలి తండ్రి.." అంటూ రాజాపేట మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ పెరిక కుల మహిళలు సోమవారం వరుణ దేవుడిని ప్రార్థించారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మహిళలు వినూత్నంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఇత్తడి, స్టీలు బిందెల్లో నిండుగా నీటిని పోసి, వాటిలో పచ్చని వేప కొమ్మలను ఉంచి సంప్రదాయ పద్ధతిలో పూజలు చేశారు. అనంతరం కూడలి మధ్యలో అలంకరణలు చేసి మహిళలందరూ చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. వర్షాభావం కారణంగా గ్రామాల్లో తలెత్తే కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను పాటల రూపంలో ఆలపించారు. మహిళలు పాడిన 'వాన' పాటలు స్థానికులను ఆకట్టుకున్నాయి. అనంతరం బిందెల్లోని నీటితో గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వానలు సమృద్ధిగా కురిసి రైతుల కష్టాలు తీరాలని మహిళలు సామూహికంగా ప్రార్థించగా, ఈ కార్యక్రమం రాజాపేట కేంద్రంలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# ద్య విద్యార్థికి 'భాస్కర్ ఫౌండేషన్' భరోసా

- వట్టిపల్లి విద్యార్థి ఈశ్వర్ సాయికి రూ. 50 వేల సాయం
- భాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్ చేతుల మీదుగా అందజేత

**తొలివెలుగు, చౌటుప్పల్/మర్రిగూడ:** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఒక ప్రతిభావంతుడైన వైద్య విద్యార్థికి 'ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్' అండగా నిలిచింది. మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన డెంకాని ఈశ్వర్ సాయి ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తొలి సంవత్సరం సీటు సాధించాడు. అయితే, కుటుంబ ఆర్థిక పరిస్థితి నిరుపేదగా ఉండటంతో పైచదువుల ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో విద్యార్థి కుటుంబ సభ్యులు ఫౌండేషన్ అధినేత ఇ.ఎల్.వి భాస్కర్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఆయన తన ఫౌండేషన్ తరఫున రూ. 50,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఫౌండేషన్ డైరెక్టర్ ఇరుగదిండ్ల అశోక్ విద్యార్థికి నగదు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతిభ ఉండి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ సహాయం అందించినట్లు తెలిపారు. ఈశ్వర్ సాయి భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి, సమాజానికి సేవ చేసే మంచి వైద్యుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.





# దివ్యాంగుల పునరావాస కేంద్రానికి ప్రత్యేక ఆటో వాహనం

- ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- రవాణా ఇబ్బందులు తొలగించేందుకు దోహదం: కలెక్టర్



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రానికి రవాణా వసతి కల్పిస్తూ సమకూరిన ప్రత్యేక ఆటో వాహనాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఆర్థిక సహకారంతో, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సౌజన్యంతో ఈ వాహనాన్ని కేంద్రానికి కేటాయించారు.

**మెరుగైన సేవలకు దోహదం:**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగులైన చిన్నారులకు మెరుగైన సేవలు అందించడంలో ఈ ప్రత్యేక ఆటో వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పునరావాస కేంద్రానికి వచ్చే చిన్నారుల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఐఓసీఎల్ ఈ రకమైన సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్డీఓ), అదనపు డీఆర్డీఓ, డీపీఎంయూ డీపీఎంలు, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య ఓబీ సభ్యులు, ఎన్ఎస్సీసీ కార్యకలాపాల సిబ్బంది, ఆయాలు, దివ్యాంగులైన చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- నేడు మూడు రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం
- రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలి: ఏఓ నాగరాజు పిలుపు



**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని చౌటుప్పల్ మండల రైతులు విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎం. నాగరాజు కోరారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దృశ్యశ్రవణ మాధ్యమం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారని తెలిపారు. చౌటుప్పల్ మండలంలోని చౌటుప్పల్ రైతు వేదిక, కుంట్లగూడెం రైతు వేదిక, పంతంగి రైతు వేదికలలో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు చెప్పారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఓ ఎం. నాగరాజు విజ్ఞప్తి చేశారు.

# ఈ చెత్త మాకొద్దు

జిల్లాలోని బండరావిరాలలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి చెత్త, కాలుష్యమయంగా చేయొద్దని బండరావిరాల, పరిసర గ్రామాల రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద కదంతొక్కారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే సుమారు 16 గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని, డంపింగ్‌యార్డు నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో 20ని వెంటనే రద్దు చేయాలని బండరావిరాలతోపాటు పరిసర గ్రామాలు ప్రజలు, నాయకులు సోమవారం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీనికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మె ల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, వంగేటి లక్ష్మారెడ్డి, దండెం రాంరెడ్డి తదితర నాయకులు, బాధితులతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అప్పటికే పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి లోనికి వెళ్లకుండా అడ్డుకోగా.. కోపోద్రిక్తులైన నాయకులు, రైతులు కలెక్టరేట్ ప్రధాన గేట్‌ను బలవంతంగా తెరిచి పోలీసులను దాటుకుని లోపలికి పరుగులు తీశారు. అక్కడే సుమారు రెండు గంటల పాటు బీఆర్ఎస్ నేతలు, రైతులు బైటాయించి ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు కోసం విడుదల చేసిన జీవో 20ని రద్దు చేయాలని, డంపింగ్‌యార్డు నిర్మాణ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తామని బీఆర్ఎస్ నేతలు, రైతులు పోలీసులను కోరగా, వారు ఐదుగురిని మాత్రమే లోనికి పంపించి మిగిలిన వారిని కట్టడి చేశారు.

# పెద్ద రావులపల్లిలో ఘోరం: తల్లిని హతమార్చి కుమారుడు ఆత్మహత్య

- 21 గుంటల భూ తగాదానే కారణం
- రాయితో మోది తల్లి పోచమ్మ హత్య.. ఫ్యాన్‌కు ఉరివేసుకున్న శ్రీనివాస్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ మధుసూదన్ రెడ్డి





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని పెద్ద రావులపల్లి గ్రామంలో సోమవారం ఒక ఘోర కలియుగ విపరీతం చోటుచేసుకుంది. కేవలం 21 గుంటల భూమి కోసం జరిగిన వివాదంలో ఓ కుమారుడు సైకోలా మారి కన్నతల్లిని రాయితో కొట్టి దారుణంగా హత్య చేశాడు. అనంతరం తానూ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు, ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంఘం గండయ్య, పోచమ్మ (65) దంపతులకు ముగ్గురు కుమారులు. 15 ఏళ్ల క్రితం గండయ్య మృతి చెందగా, తల్లి పోచమ్మ తనకున్న ఆరెకరాల భూమిని ముగ్గురు కొడుకులకు తలా రెండు ఎకరాల చొప్పున పంచింది. అయితే, పెద్ద కుమారుడు వెంకటేష్, చిన్న కుమారుడు శ్రీనివాస్ (42) మధ్య సర్వే నంబర్ల తప్పుల వల్ల భూమి మార్పిడి వివాదం నడుస్తోంది.

**అనారోగ్యం, తాగుడు మహమ్మారి:**

శ్రీనివాస్ గతంలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. వెన్నుముక ఆపరేషన్ తర్వాత ఫిట్‌నెస్ పరీక్షలో విఫలమవడంతో ఉద్యోగం కోల్పోయాడు. అప్పటి నుంచి తాగుడుకు బానిసయ్యాడు. తనకున్న 2 ఎకరాలలో ఎకరంన్నర అమ్ముకోగా, మిగిలిన 21 గుంటల భూమి తన పేరిట రాలేదని గొడవకు దిగాడు. ఈ విషయమై ఆదివారం సర్పంచ్ సమక్షంలో పంచాయతీ కూడా జరిగింది. ఆ రాత్రి మద్యం మత్తులో భార్య పద్మ తలపై రాయితో కొట్టగా ఆమెకు గాయాలయ్యాయి. దాంతో ఆమె పుట్టింటికి వెళ్ళిపోయింది. అదే రాత్రి ఇంట్లో ఉన్న తల్లి పోచమ్మతో శ్రీనివాస్ తీవ్రంగా గొడవపడి, ఆమె తలపై రాయితో బలంగా మోది హతమార్చాడు. సోమవారం ఉదయం కూడా ఏమీ తెలియనట్లు బెల్ట్ షాపునకు వెళ్లి మద్యం తెచ్చుకుని తాగాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో పోచమ్మ స్నేహితురాలు ఇందిర కిటికీలోంచి చూడటంతో ఈ దారుణం వెలుగుచూసింది. పోచమ్మ రక్తపు మడుగులో పడి ఉండటం, శ్రీనివాస్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతుండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు.

**ఉన్నతాధికారుల తనిఖీ:**

విషయం తెలిసిన వెంటనే చౌటుప్పల్ డీసీపీ పి. మధుసూదన్ రెడ్డి, రూరల్ సీఐ సతీష్ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రెడ్డి క్లూస్ టీమ్‌తో ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆధారాలు సేకరించి, గ్రామస్థుల నుంచి సాక్ష్యాలు నమోదు చేశారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ఘటనతో పెద్ద రావులపల్లి గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టరేట్‌లో 69 దరఖాస్తుల స్వీకరణ
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, మొత్తం 69 దరఖాస్తులు నమోదయ్యాయి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రజావాణిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 69 అర్జీలలో.. రెవెన్యూ శాఖ-31, జిల్లా గ్రామీణాభివృద్ధి-7, సర్వే ల్యాండ్స్-6, మున్సిపాలిటీ-6, వ్యవసాయ శాఖ-4, సంక్షేమ శాఖ-3, ఆర్టీసీ-2, జిల్లా పరిషత్-2 చొప్పున వచ్చాయి. అలాగే చేనేత, కోఆపరేటివ్, సమాచార, విద్యాశాఖ, బీసీ సంక్షేమం, గృహనిర్మాణం, వైద్యారోగ్య, పంచాయతీరాజ్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) నాగిరెడ్డి, డీఆర్ఓ జయమ్మ, హౌసింగ్ పీడీ అలివేలు, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.







# వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

- అంగరంగ వైభవంగా అమ్మవారి కళ్యాణ మహోత్సవం
- హాజరైన మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం):** మండల పరిధిలోని తుక్కపురం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు జరిపి విగ్రహ ప్రతిష్టాపన గావించారు. అనంతరం లోక కల్యాణార్థం పెద్దమ్మ తల్లి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆలేరు మాజీ శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన ముదిరాజ్ సంఘం నాయకులను ఆమె శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాట రాములు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పల చందర్ గౌడ్, కోరే బిక్షపతి, సర్పంచ్ సంఘపాక శ్రీవాణి మహేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు యాట మధు, సామ బుచ్చిరెడ్డి, కల్వల నరేష్, మాజీ సర్పంచ్ చిక్కిరి మంగమ్మ రవి, ఆలయ నిర్మాణ దాతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మళ్లీ తెరుచుకున్న 'బాలంపల్లి' బడి.. ఒక్కటైన ఊరు!

- ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు సహకరించాలి
- విద్యార్థులకు తక్షణమే పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందించాలి: డీఈఓ భిక్షపతి

**తొలివెలుగు, భువనగిరి రూరల్:** ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పూర్తి స్థాయిలో సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) బొల్లారం భిక్షపతి కోరారు. గతంలో విద్యార్థుల సంఖ్య లేక మూతపడిన భువనగిరి మండలంలోని బాలంపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వం కూడా అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకే పంపించాలని పిలుపునిచ్చారు. పునఃప్రారంభమైన బాలంపల్లి పాఠశాలకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతితో పాటు ఉపాధ్యాయులను వెంటనే సర్దుబాటు చేయాలని మండల విద్యాధికారిని (ఎండీఓ) ఆదేశించారు. పాఠశాల పునఃప్రారంభానికి చొరవ చూపిన గ్రామ సర్పంచ్ శ్రీరామ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. సర్పంచ్ శ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు వేల రూపాయలు ఖర్చు పెట్టకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉచిత వసతులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి, మండల విద్యాధికారి ఆర్.రంగరాజన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎన్.అండాలు, ఉపసర్పంచ్ కృష్ణ, స్థానిక వార్డు సభ్యులు, సీఆర్పీ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# రామన్నపేట చేనేత సహకార సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల

- జూలై 2 నుంచి నామినేషన్లు.. 10న పోలింగ్, ఓట్ల లెక్కింపు
- అధ్యక్షుడు జెల్ల వెంకటేష్‌కు ఓటర్ల తుది జాబితా అందజేత

**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర సహకార సంఘం ఆదేశాల మేరకు రామన్నపేట కాటన్ చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి కె. సురేష్ సోమవారం అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు జెల్ల వెంకటేష్‌కు ధ్రువీకరించిన ఓటర్ల తుది జాబితాను అందజేశారు. సంఘంలో మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయని, ఇందులో ఏడుగురు జనరల్ కేటగిరీకి, ఇద్దరు మహిళలకు కేటాయించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ జూలై 2 నుంచి ప్రారంభమై జూలై 10న పోలింగ్, ఓట్ల లెక్కింపుతో ముగియనుంది.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు:**

- **నామినేషన్ల స్వీకరణ: జూలై 2 నుంచి 4 వరకు**
- **నామినేషన్ల పరిశీలన: జూలై 5**
- **ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు: జూలై 6**
- **పోలింగ్: జూలై 10 ఉదయం**
- **ఓట్ల లెక్కింపు: జూలై 10 మధ్యాహ్నం 2 గంటల నుంచి**

**రూ.750 నామినేషన్ ఫీజు:**

నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.750 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారి కె. సురేష్ తెలిపారు. అభ్యర్థులు తమను ప్రతిపాదించిన సభ్యులతో కలిసి స్వయంగా వచ్చి నామినేషన్ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం మూడు రోజుల్లోపు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల షెడ్యూల్‌ను తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పెండం వేణు, కార్యదర్శి దొంత నాగరాజు, వనం నరసింహ, పెండెం బాహన ఋషి, గంజి అశోక్, కైరంకొండ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో చేనేత సంఘంలో ఎన్నికల సందడి నెలకొంది.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- విజన్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం
- గ్రామాభివృద్ధికి సంస్థల సహకారం అభినందనీయం: సర్పంచ్ వెంకటేష్



**తొలివెలుగు, చౌటుప్పల్:** మండల పరిధిలోని మందోళ్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గల సింగరాయచెరువు (సప్పిడోళ్లగూడెం) గ్రామంలో సోమవారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని స్మశానవాటికలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సాంప్రదాయబద్ధంగా శంకుస్థాపన చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఈ రోడ్డు నిర్మాణానికి పూర్తి ఆర్థిక, సాంకేతిక సహకారం అందించిన విజన్ కంపెనీ యాజమాన్యానికి ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తంగేళ్ల వెంకటేష్ మాట్లాడుతూ.. పల్లెల అభివృద్ధిలో ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమన్నారు. మందోళ్లగూడెం పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు విజన్ కంపెనీ అండగా నిలవడం అభినందనీయమన్నారు. స్మశానవాటిక రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుర్కంటి శ్రీధర్‌రెడ్డి, వార్డు సభ్యులు యాట వెంకటేష్, చప్పిడి హంసమ్మ, మానే రవికుమార్, గుండు శ్రీశైలం, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మైనంపల్లి హన్మంతరావు అనుచరుడిపై పోక్సో కేసు..!

ౠాజూా ఝుంవ : కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు అనుచరుడు రవి కుమార్(ఘజఌ ఖబఝుతీ) అలియాస్ రఫీపై పోక్సో కేసు (ౠాజూా ఝుంవ) నమోదైంది. అల్వాల్‌లో జిమ్‌లో పరిచయమైన యువతిని ట్రాప్ చేసిన రవి.. బాధిత మహిళతో పాటు మైనరైన ఆమె కూతురిని కూడా వేధించడంతో అతడిపై పోక్సో కేసు పెట్టారు. ఏ1గా రవి, అతడికి సహాయం చేసిన సోదరుడు ఏ2 రూపేష్‌పై పోక్సో కేసు రిజిస్టరైంది. మైనంపల్లి హన్మంతరావు అనుచరుడైన రవి కుమార్ అలియాస్ రఫీ గతంలోనూ అమ్మాయిలను మోసం చేశాడు. ప్రేమ పేరుతో ముగ్గురు యువతులను పెళ్లి చేసుకొని, వారి ప్రైవేట్ వీడియోలు తీసి డబ్బుల ఇవ్వాలని బెదిరించినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. నిత్య పెళ్లి కొడుకైన రవికి ఇటీవల అల్వాల్ జిమ్‌లో పరిచయమైన యువతిని ట్రాప్ చేసి రూ.10 లక్షలు ఇవ్వాలని వేధింపులకు గురి చేశాడు. దాంతో, సదరు యువతి ఫిర్యాదుతో రవిపై పోక్సో కేసు పెట్టారు.

# తెలంగాణలో బీజేపీ పప్పులు ఉడకవు: జహంగీర్





- కేంద్ర ఆర్థిక విధానాలతో సామాన్యుడిపై భారం
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి
- వలిగొండలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం

**తొలివెలుగు, వలిగొండ:** అధికార దాహంతో పగటి కలలు కంటున్న బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవని, ఆ పార్టీకి ఇక్కడ ఎలాంటి భౌతిక సానుకూలత లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో సోమవారం నిర్వహించిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రజలు గత ఎన్నికల్లో 8 మంది ఎంపీలను, 8 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే రాష్ట్రానికి వారు సాధించిందేమిటో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి గల ఈ గడ్డపై ప్రజలు మత రాజకీయాలను ఎప్పటికీ తిప్పికొడతారని స్పష్టం చేశారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ధ్వజం:**

బీజేపీ పన్నెండేళ్ల పాలన దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీసిందని జహంగీర్ విమర్శించారు. నిరుద్యోగాన్ని పారదోలుతామని చెప్పి దేశంలో 14 కోట్ల మంది విద్యావంతులైన యువతను నిరుద్యోగులుగా మార్చారని, ధరల పెరుగుదలతో కేంద్రం ఆర్థిక దోపిడీకి పాల్పడుతోందని మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం మాటలతో ప్రజల జీవితాల్లో మార్పు రాదని, ఇచ్చిన హామీలను వెంటనే చేతల్లో చూపించాలని హితవు పలికారు. ఈ తరగతుల ప్రారంభ సూచికగా స్థానిక సర్పంచ్ పైల్ల సంధ్యారాణి పార్టీ జెండాను ఆవిష్కరించారు. క్లాస్ ప్రిన్సిపాల్‌గా కందడి సత్తిరెడ్డి వ్యవహరించగా.. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గణపతి రెడ్డి, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 'ఇందిరమ్మ మహిళా శక్తి' చీరల పంపిణీ

- చౌటుప్పల్‌లో వైభవంగా చీరల పంపిణీ ప్రారంభం
- 20 మహిళా సంఘాలకు చెందిన 192 మంది సభ్యులకు చీరల పంపిణీ

**తొలివెలుగు, చౌటుప్పల్:** మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతను లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం మహిళల అభ్యున్నతికి దోహదపడుతుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలో సోమవారం ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్‌లతో కలిసి ఆమె చీరల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి, వారి సర్వతోముఖాభివృద్ధికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పథకం కింద మున్సిపాలిటీ పరిధిలోని 20 మహిళా సంఘాలకు చెందిన సుమారు 192 మంది సభ్యులకు చీరలను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగతా వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు ఆయా మహిళా సంఘాల సభ్యులకు చీరలను అందజేస్తారని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, షాదీఖానా చైర్మన్ కరీం, కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బద్రి గాలయ్య, దేప రమ్య రాజు, పాక చిరంజీవి, బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, బత్తుల జయమ్మ దాస్, చింతల ఉమామేశ్వరి సాయిలు, పిల్లలమర్రి మధుసూదన్, ఎండి హన్ను, కో-ఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, బాబా షరీఫ్, సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





# టాస్క్‌ల పేరుతో ఐటీ ఉద్యోగికి టోకరా

: ఇన్‌స్టాగ్రామ్‌లో దుబాయ్ రిసార్ట్ అకామిడేషన్ డీల్, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ప్రకటన చూసి ఆకర్షితుడైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆ లింక్ క్లిక్ చేసి సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి రూ.25 లక్షలు పోగొట్టుకున్నాడు. అమీన్‌పూర్‌కు చెందిన బాధితుడికి దుబాయ్‌లోని బుల్గారీ రిసార్ట్ హోటల్ రిజర్వేషన్ టాస్క్‌లు పూర్తి చేయాలని సైబర్‌నేరగాళ్లు సూచించారు. ఈ టాస్క్‌లు పూర్తి చేస్తే ఇండియన్ స్టాక్ మార్కెట్ బ్లాక్ ట్రేడింగ్ ద్వారా భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. దీనికి ఒప్పుకున్న బాధితుడు మొదట రూ.10 వేలు పెట్టుబడి పెట్టి హోటల్ రిజర్వేషన్ టాస్క్‌లు పూర్తి చేశాడు. దీనికి రూ.40 వేల వరకు లాభం రావడంతో వాటిని విత్ డ్రా చేసుకున్నాడు. దీంతో సైబర్‌నేరగాళ్లు చెప్పే మాటలపై పూర్తి నమ్మకం పెరిగింది. ఆ తరువాత వీఐపీ,, కాంబినేషన్ టాస్క్‌ల్లో భారీగా లాభాలుంటాయని దప దఫాలుగా రూ.25,12,758 పెట్టుబడి పెట్టించారు. స్క్రీన్‌పై లాభం కన్పిస్తోన్నా విత్ డ్రా చేయకుండా నిలిపేశారు. ఆ డబ్బు విత్ డ్రా చేయాలంటే అకౌంట్ వెరిఫికేషన్ ఫీజుల పేరటి రూ.41 లక్షలు కట్టాలని నేరగాళ్లు ఒత్తిడి తెచ్చాడు. వారి ఒత్తిళ్లతో అనుమానం వచ్చిన బాధితుడు తాను మోసపోయానని గ్రహించి సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- జూలై 2 నుంచి నామినేషన్ల స్వీకరణ.. 10న పోలింగ్, ఓట్ల లెక్కింపు
- ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల అధికారి ఎండి. యూసఫ్ అలీ

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రసిద్ధ చేనేత కేంద్రమైన భూదాన్ పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల అధికారి ఎండి. యూసఫ్ అలీ సోమవారం అధికారికంగా విడుదల చేశారు. జూలై 2వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై జూలై 10వ తేదీన పోలింగ్, ఓట్ల లెక్కింపుతో ముగియనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచంపల్లి చేనేత సహకార సంఘంలో మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్ల పదవులు ఉన్నాయని తెలిపారు. ఇందులో ఏడుగురు జనరల్ కేటగిరీకి, ఇద్దరు మహిళా డైరెక్టర్లకు కేటాయించినట్లు పేర్కొన్నారు. సంఘానికి చెందిన అర్హులైన సభ్యులు రహస్య బ్యాలెట్ విధానంలో తమ ప్రతినిధులను ఎన్నుకోనున్నారని చెప్పారు.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు:**

- **నామినేషన్ల స్వీకరణ: జూలై 2 నుంచి 4 వరకు**




- **నామినేషన్ల పరిశీలన: జూలై 5**
- **నామినేషన్ల ఉపసంహరణ: జూలై 6**
- **పోలింగ్: జూలై 10, ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు**
- ఓట్ల లెక్కింపు: జూలై 10, మధ్యాహ్నం 3 గంటల నుంచి

ఎన్నికల నియమావళిని సభ్యులందరూ విధిగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సహకరించాలని ఎన్నికల అధికారి ఎండి. యూసఫ్ అలీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో పోచంపల్లి చేనేత వర్గాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

# సముద్రంలో కుప్పలు కుప్పలుగా బంగారం..



దక్షిణ పసిఫిక్ మహాసముద్రం లోతుల్లో దాగిన ఒక అద్భుతమైన భౌగోళిక రహస్యాన్ని శాస్త్రవేత్తలు ఛేదించారు. భూమిపై అత్యంత విలువైన బంగారు నిల్వలు ఎలా ఏర్పడతాయో వివరించే కీలక ప్రక్రియలను జర్మనీకి చెందిన 'జియోమార్ హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ ఓషన్ రీసెర్చ్ కీల్' సంస్థకు చెందిన ప్రముఖ మెరైన్ జియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టియన్ టిమ్ నేతృత్వంలోని బృందం కనుగొంది. దక్షిణ పసిఫిక్ మహాసముద్రం లోతుల్లో దాగిన ఒక అద్భుతమైన భౌగోళిక రహస్యాన్ని శాస్త్రవేత్తలు ఛేదించారు. భూమిపై అత్యంత విలువైన బంగారు నిల్వలు ఎలా ఏర్పడతాయో వివరించే కీలక ప్రక్రియలను జర్మనీకి చెందిన 'జియోమార్ హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ ఓషన్ రీసెర్చ్ కీల్' సంస్థకు చెందిన ప్రముఖ మెరైన్ జియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టియన్ టిమ్ నేతృత్వంలోని బృందం కనుగొంది. ఈ సంచలనాత్మక పరిశోధన వివరాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన 'కమ్యూనికేషన్స్ ఎర్త్ అండ్ ఎన్విరాన్మెంట్', 'నేచర్' వంటి సైన్స్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రచురితమయ్యాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా వెల్లడించిన కథనం ప్రకారం.. న్యూజిలాండ్ సమీపంలోని 'కెర్మాడెక్' వంటి ద్వీప సముదాయాలు అచ్చం 'బంగారు కర్మాగారాల' వలె పనిచేస్తూ సముద్ర గర్భంలో అపారమైన సంపదను ఎలా సృష్టిస్తున్నాయో ఈ అధ్యయనం శాస్త్రీయంగా నిరూపించింది. దక్షిణ పసిఫిక్ మహాసముద్రం లోతుల్లో దాగిన ఒక అద్భుతమైన భౌగోళిక రహస్యాన్ని శాస్త్రవేత్తలు ఛేదించారు. భూమిపై అత్యంత విలువైన బంగారు నిల్వలు ఎలా ఏర్పడతాయో వివరించే కీలక ప్రక్రియలను జర్మనీకి చెందిన 'జియోమార్ హెల్మ్‌హోల్ట్జ్ సెంటర్ ఫర్ ఓషన్ రీసెర్చ్ కీల్' సంస్థకు చెందిన ప్రముఖ మెరైన్ జియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టియన్ టిమ్ నేతృత్వంలోని బృందం కనుగొంది. ఈ సంచలనాత్మక పరిశోధన వివరాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన 'కమ్యూనికేషన్స్ ఎర్త్ అండ్ ఎన్విరాన్మెంట్', 'నేచర్' వంటి సైన్స్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రచురితమయ్యాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా వెల్లడించిన కథనం ప్రకారం.. న్యూజిలాండ్ సమీపంలోని 'కెర్మాడెక్' వంటి ద్వీప సముదాయాలు అచ్చం 'బంగారు కర్మాగారాల' వలె పనిచేస్తూ సముద్ర గర్భంలో అపారమైన సంపదను ఎలా సృష్టిస్తున్నాయో ఈ అధ్యయనం శాస్త్రీయంగా నిరూపించింది. సాధారణంగా భూమి లోపల ఉండే బంగారం ఇంత భారీ మొత్తంలో సముద్ర గర్భంలోకి ఎలా చేరుతుందనేది దశాబ్దాలుగా ఒక మిస్టరీగా ఉండేది. ఈ నిల్వలు యాదృచ్ఛికంగా ఏర్పడటం లేదని.. భూమి లోపలి పొర అయిన 'మ్యాంటిల్' పదేపదే కరగడం వల్ల మాత్రమే ఇది సాధ్యమవుతుందని పరిశోధకులు గుర్తించారు. సముద్రపు అడుగున ఉండే టెక్టానిక్ ప్లేట్లు ఒకదాని కిందకు ఒకటి వెళ్లే క్రమంలో ఆ పలకల నుంచి నీరు, ఇతర ద్రవాలు విడుదలవుతాయి. ఈ ద్రవాలు భూమి లోపల ఒక 'ఫ్లక్స్' లాగా పనిచేసి అక్కడ ఉండే శిలలను తగ్గిస్తాయి. దీనివల్ల శిలలు త్వరగా కరిగి లావాగా మారుతాయి.సాధారణంగా భూమి లోపల ఉండే బంగారం ఇంత భారీ మొత్తంలో సముద్ర గర్భంలోకి ఎలా చేరుతుందనేది దశాబ్దాలుగా ఒక మిస్టరీగా ఉండేది. ఈ నిల్వలు యాదృచ్ఛికంగా ఏర్పడటం లేదని.. భూమి లోపలి పొర అయిన 'మ్యాంటిల్' పదేపదే కరగడం వల్ల మాత్రమే ఇది సాధ్యమవుతుందని పరిశోధకులు గుర్తించారు. సముద్రపు అడుగున ఉండే టెక్టానిక్ ప్లేట్లు ఒకదాని కిందకు ఒకటి వెళ్లే క్రమంలో ఆ పలకల నుంచి నీరు, ఇతర ద్రవాలు విడుదలవుతాయి. ఈ ద్రవాలు భూమి లోపల ఒక 'ఫ్లక్స్' లాగా పనిచేసి అక్కడ ఉండే శిలలను తగ్గిస్తాయి. దీనివల్ల శిలలు త్వరగా కరిగి లావాగా మారుతాయి. శాస్త్రవేత్తలు సముద్రపు అడుగున ఉన్న అగ్నిపర్వతాల నుంచి సేకరించిన దాదాపు 66 అగ్నిపర్వత గాజు నమూనాలను పరీక్షించారు. ఈ అగ్నిపర్వత గాజు అనేది లావా సముద్రపు చల్లని నీటిని తాకినప్పుడు ఒక్కసారిగా గడ్డకట్టి ఏర్పడుతుంది. సాధారణ రాళ్లతో పోలిస్తే.. ఈ 'ప్రిమిటివ్' గ్లాస్ నమూనాల్లో బంగారం నిల్వలు చాలా ఎక్కువగా ఉండటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచింది. అంటే లావా అగ్నిపర్వతం ద్వారా బయటకు రాకముందే, భూమి లోపల ఉన్న 'ప్లంబింగ్ వ్యవస్థ'లోనే బంగారం శుద్ధి చేయబడి, ఒకచోట కేంద్రీకృతమవుతోందని దీనివల్ల స్పష్టమైంది. శాస్త్రవేత్తలు సముద్రపు అడుగున ఉన్న అగ్నిపర్వతాల నుంచి సేకరించిన దాదాపు 66 అగ్నిపర్వత గాజు నమూనాలను పరీక్షించారు. ఈ అగ్నిపర్వత గాజు అనేది లావా సముద్రపు చల్లని నీటిని తాకినప్పుడు ఒక్కసారిగా గడ్డకట్టి ఏర్పడుతుంది. సాధారణ రాళ్లతో పోలిస్తే.. ఈ 'ప్రిమిటివ్' గ్లాస్ నమూనాల్లో బంగారం నిల్వలు చాలా ఎక్కువగా ఉండటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచింది. అంటే లావా అగ్నిపర్వతం ద్వారా బయటకు రాకముందే, భూమి లోపల ఉన్న 'ప్లంబింగ్ వ్యవస్థ'లోనే బంగారం శుద్ధి చేయబడి, ఒకచోట కేంద్రీకృతమవుతోందని దీనివల్ల స్పష్టమైంది.

# నిరుద్యోగులకు గోల్డెన్ ఛాన్స్... ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి..!




మహబూబ్ నగర్ డివైఎస్ఓ ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సులు ప్రకటించింది, గ్రామీణ నిరుద్యోగ యువతకు టిఫిన్ భోజనం సహా సౌకర్యాలు, సర్టిఫికెట్ తో బ్యాంకు రుణాల అవకాశాలు. వనపర్తి జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ... దరఖాస్తుకు చివరి తేద వనపర్తి జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ... దరఖాస్తుకు చివరి తేద ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఒక అరుదైన అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఉపాధి కోసం ఎదురుచూస్తున్న వారికి స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేసేలా జిల్లా యువజన క్రీడల శాఖ (ఢూా) ఆధ్వర్యంలో పలు ఉచిత శిక్షణా కోర్సులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, వారు స్వంతంగా ఉపాధి అవకాశాలను సృష్టించుకునేలా చేయడం లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ కాలంలో ఎటువంటి ఫీజులు వసూలు చేయబోమని స్పష్టం చేస్తూ, అభ్యర్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం కూడా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్న యువతకు ఇది మరింత అనుకూలంగా మారింది.

# వంటగ్యాస్ సిలిండర్లపై కేంద్రం భారీ గుడ్ న్యూస్..



ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారతదేశంలో గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా అత్యంత స్థిరంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారతదేశంలో గృహ వినియోగ ఎల్పీజీ (ఞా+) సరఫరా అత్యంత స్థిరంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వంటగ్యాస్ పంపిణీలో ఎక్కడా ఎటువంటి అంతరాయాలు లేవని, వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల లభ్యత సాధారణంగానే ఉందని అధికారులు వెల్లడించారు. పంపిణీ కేంద్రాల వద్ద సిలిండర్ల కొరత వల్ల సరఫరా నిలిచిపోయిన దాఖలాలు లేవని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ప్రస్తుత అంతర్జాతీయ భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, భారతదేశంలో గృహ వినియోగ ఎల్పీజీ (ఞా+) సరఫరా అత్యంత స్థిరంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వంటగ్యాస్ పంపిణీలో ఎక్కడా ఎటువంటి అంతరాయాలు లేవని, వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల లభ్యత సాధారణంగానే ఉందని అధికారులు వెల్లడించారు. పంపిణీ కేంద్రాల వద్ద సిలిండర్ల కొరత వల్ల సరఫరా నిలిచిపోయిన దాఖలాలు లేవని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# ఆల్కహాల్‌ను సాధారణంగా సెలబ్రేషన్స్ పార్టీలు, హ్యాపీ మూడ్




కామన్‌గా ఈ అలవాటుతో మెంటల్ ప్రెజర్ తగ్గిస్తుందని కొందరు చెబుతారు. స్నేహితులు, బంధువులతో పీస్‌ఫుల్‌గా గడపటానికే అని మరికొందరు చెబుతుంటారు. అయితే చాలా మంది బీర్స్, బ్రీజర్స్ వంటివి స్వీకరిస్తున్నారు. బీర్, బ్రీజర్ రెండు ఆల్కహాల్ పర్సెంటేజ్ డ్రింక్స్ అయినప్పటికి రుచి,ఆల్కహాల్ శాతంలో తేడాలు ఉంటాయి. బీరు బార్లీతో తయారయ్యే చేదుగా ఉంటుంది. బ్రీజర్ రమ్ బేస్ తో ఫ్రూట్ ఫ్లేవర్ తో తీపిగా ఉంటుంది. అందుకే చాలామంది యువత, అమ్మాయిలు బ్రీజర్స్ ఎక్కువగా ప్రెఫర్ చేస్తుంటారు.తెలంగాణలో మద్యం ప్రియులు ఎక్కువగా తాగే డ్రింక్ అంటే బ్రీజర్స్ ఫస్ట్ ప్లేసులో ఉంది. బకార్డి రమ్ కార్బోనేటెడ్ వాటర్ పండ్ల రసాలతో తయారయ్యే ఈ బ్రీజర్లు టేస్టులో స్వీట్‌గా ఉండటంతో పాటు మంచి ఫ్లేవర్ స్మెల్ రావడం, మద్యం వాసన లేకపోవడం వల్ల వీటిని చాలా మంది ఇష్టపడతారు. క్రాన్ బెర్రీ, లైమ్, ఆరెంజ్, బ్లాక్ బెర్రీ, పీచ్ వంటి అనేక ఫ్లేవర్స్ ఇందులో ఉన్నాయి. బ్రిజర్స్ లో సాధారణంగా 4% నుంచి 4.8% వరకు ఆల్కహాల్ ఉంటుంది. సాధారణంగా రూ.130కి లభించే బ్రీజర్ ను చాలా మంది పబ్‌లు, పార్టీలు, ఫ్యామిలీ ఫంక్షన్‌లలో తాగుతుంటారు. తెలంగాణలో ప్రస్తుతం బ్రీజర్ల కొరత ఏర్పడింది. వేసవిలో ఎక్కువగా అమ్మకాలు జరిగే బ్రీజర్లు దొరకకపోవడంతో మద్యం ప్రియులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ఇలా వివిధ ప్రాంతాల్లోని వైన్ షాపుల్లో బ్రీజర్ బాటిళ్లు కనిపించడం లేదు. తయారీ సంస్థలు ఎక్సైజ్ శాఖ మధ్య చెల్లింపుల వివాదం కారణంగా వీటి సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల రాష్ట్రంలో కొరత మరింత తీవ్రంగా మారింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల సమస్య కారణంగా కొన్ని పెద్ద కంపెనీలు సరఫరా నిలిపివేశాయి. ప్రభుత్వం పెండింగ్ చెల్లింపులు త్వరలో క్లియర్ చేస్తే సరఫరా మళ్ళీ ప్రారంభమయ్యే అవకాశం ఉందని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి.అయితే మరి వీటిని ఇష్టపడే వారికి ఈవార్త మింగుడు పడటం లేదు.ఈ భారీ సేవా కార్యక్రమానికి రిలయన్స్ ఫౌండేషన్ పూర్తి ఆర్థిక సహకారాన్ని అందించింది. హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహారం, చదువుకు కావాల్సిన స్టేషనరీ వస్తువులను పంపిణీ చేస్తున్నారు. కేవలం వేడుకలు జరుపుకోవడమే లక్ష్యం కాకుండా, విద్యార్థుల విద్యా అవసరాలు, ఆరోగ్యంపై దృష్టి సారించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ పంపిణీ ద్వారా వేల సంఖ్యలో విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూరుతోంది.

# వావ్ అదిరిపోయింది..! కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 రైలు చూశారా?..



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో అప్‌గ్రేడ్ చేసిన నమూనా కోచ్‌ను ప్రజలకు పరిచయం చేశారు. ఈ కొత్త కోచ్ రూపకల్పన, అందులో చేసిన మార్పులు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించడంపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. 3.0 భారతీయ రైల్వేలు త్వరలో ప్రవేశపెట్టనున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 కోచ్‌లతో రైలు ప్రయాణంలో మరో కొత్త దశ ప్రారంభం కానుంది. తక్కువ ఖర్చుతో పాటు మంచి సౌకర్యాలు కల్పించడం ఈ కోచ్‌ల ప్రధాన లక్ష్యం. ఇటీవల మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ నమూనా కోచ్‌ను పరిశీలిస్తూ, ప్రయాణికుల భద్రత మరియు సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి కొత్త డిజైన్‌తో పాటు మెరుగైన టాయిలెట్ సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న ఒక కోచ్‌ను అప్‌గ్రేడ్ చేసి ఈ నమూనాను సిద్ధం చేసినట్లు వివరించారు. 3.0 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఇప్పటివరకు తక్కువ ధర టికెట్లతో ఫేమస్ అయింది. అయితే 3.0 వెర్షన్‌లో మరో అడుగు ముందుకేసి, ఇప్పుడు ఎయిర్ కండిషన్డ్ (ూాజ) కోచ్‌లను కూడా అందుబాటులోకి తీసుకురానుంది. దీని వల్ల ప్రయాణికులకు మరిన్ని ఎంపికలు లభిస్తాయి. నమూనా కోచ్ లోపలి డిజైన్ చూస్తే కాంతివంతంగా, శుభ్రంగా మరియు సమన్వయంతో రూపొందించినట్లు తెలుస్తోంది. సీట్లు, కర్టెన్లు, ఫ్లోర్, వాష్‌రూమ్ వరకు ఒకే విధమైన కలర్ థీమ్ ఉండటం వల్ల ప్రీమియం లుక్ కలుగుతోంది. ఇది సంప్రదాయ భారతీయ రైళ్ల రూపానికి భిన్నంగా ఉంటుంది. అదనంగా, స్నాక్ టేబుళ్లను కొత్తగా డిజైన్ చేయడం, బలమైన ూాఎజ ఫ్లోరింగ్ వినియోగం, మెరుగైన సీట్లు మరియు బెర్త్ మెటీరియల్స్ వాడటం వల్ల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. టాయిలెట్లను కూడా మెరుగైన పదార్థాలతో రూపొందించడం వల్ల అవి మరింత పరిశుభ్రంగా, ఉపయోగించడానికి సులభంగా ఉంటాయి. ఈ కొత్త కోచ్‌లలో ముఖ్యమైన అంశం ఫైర్ సేఫ్టీపై ప్రత్యేక దృష్టి పెట్టడం. రైల్వే శాఖ తెలిపిన ప్రకారం, ఈ కోచ్‌లు ూ3 స్థాయి అగ్ని భద్రత ప్రమాణాలతో రూపొందించబడ్డాయి. అంటే కోచ్ లోపల ఉపయోగించిన పదార్థాలు అగ్ని ప్రమాదాలకు ఎక్కువగా నిరోధకంగా ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను రక్షించే విధంగా నిర్మాణం కూడా మెరుగుపరచబడింది. దీర్ఘ దూర ప్రయాణాల్లో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఉండే సందర్భాల్లో ఈ భద్రతా ప్రమాణాలు ఎంతో కీలకం.అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 3.0 ద్వారా భారతీయ రైల్వేలు ప్రయాణాన్ని కేవలం తక్కువ ఖర్చుతో మాత్రమే కాకుండా, ఆధునికంగా, భద్రంగా మార్చాలనే సంకల్పాన్ని చూపిస్తున్నాయి. ఈ కొత్త కోచ్‌లతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన, శుభ్రమైన, భద్రమైన ప్రయాణ అనుభవం లభించే అవకాశముంది.